ONE PERSON CAN MAKE DIFFERENCE
B.K. YADAV FOUNDATION

# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
మే 6, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

## తెలంగాణ రోడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

రోడ్డు కనెక్టివిటీతోనే రాష్ట్రభివృద్ధి సాధ్యం

రూ.3,900 కోట్ల విలువైన పనులకు ప్రారంభం

నీటి సంరక్షణ పథకాలతో రైతులకు మేలు

ఈ దశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి

కాగజ్‌నరగ్ వేదికగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**కుమ్రంభీమ్ ఆసిఫాబాద్:** తెలంగాణలో రోడ్ల అభివృద్ధి బాధ్యత తనదని..అయితే నీటి సంరోణ ద్వారా భవిష్యత్ తరాలకు మనం నీటి నిల్వలు అందించాల్సి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బాధ్యతను స్వీకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రి గడ్కరీ కోరారు. విదర్భ ప్రాంతంలో నీటి నిల్వల ప్రాజెక్టులు చేపట్టి విజయం సాధించామని అన్నారు. వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే 4 అంశాలు దేశాభివృద్ధిని నిర్దేశిస్తాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సభావేదికపై నుంచి జాతీయ రహదారులను ఆయన ప్రారంభించారు. రూ.3,900 కోట్ల విలువైన పనులను మొదలుపెట్టి మాట్లాడారు.ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు- చేసిన బహిరంగ సభా వేదిక పైనుంచే 7 జాతీయరహదారులు ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని, భూమికోసం, భుక్తి కోసం.. జిల్లా ప్రజలు మిగతా 2లో



## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

ఇవన్నీ ప్రభుత్వ హత్యగానే గుర్తించాలి

ఎక్కడా ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు

అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనాలి

అందాలపోటీపై ఉన్న శ్రద్ధ రైతులపైనా పెట్టండి

బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



**సిద్దిపేట:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మరణాలకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యులని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గు చేటుని విమర్శించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి మిగతా 2లో

## రూపాయి అప్పుకూడా పుట్టని పరిస్థితి



రాజకీయ ఉచ్చులో సమిధలు కావద్దు

సమరం కాదు.. సంయమనం కావాలి

మీకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం

కలసి పని చేస్తేనే తెలంగాణ బలపడుతుంది

ఉద్యోగ సంఘాల సమ్మె ప్రకటనలపై సిఎం రేవంత్

2లో

## మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత



2లో

ఎక్కడా లోపం రాకుండా పటిష్ట ఏర్పాట్లు

మే10నుంచి 31 వరకు పోటీలపై ప్రత్యేక చర్యలు

చారిత్రక ప్రాంతాల్లో పర్యటించే వారికి సదుపాయాలు

అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

15న పోచంపల్లి సందర్శించనున్న మిస్ పోటీదారులు

భారీగా ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ



## ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

ఉద్యోగాల నియమకాలు..

కొత్త బస్సుల కొనుగోళ్ల చేశాం

అనేక బకాయిలను కూడా చెల్లించి మేలు చేశాం

ఇప్పుడు సమ్మెతో మళ్లీ వెనకపడేయవద్దు

ఆర్టీసీ కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం సూచన

**హైదరాబాద్:** కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని ,ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సీసీఎస్, పీఎఫ్ పైసలు వాడుకున్నారని విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసి గాడితో పడుతున్న సమయంలో ఆర్టీసీ సమ్మె ప్రతిపాదన సరికాదని అన్నారు. సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన మిగతా 2లో

## బిఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు

హరీష్‌ను అన్ ఫాలో చేసిన కెటిఆర్

వైఎస్ బతికుంటే హరీష్ కాంగ్రెస్‌లో ఉండేవారు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై ఆది శ్రీనివాస్ షాకింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు ఉన్నాయని.. తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని అన్నారు. హరీష్‌రావును సోషల్ మీడియాలో కేటీఆర్ అన్ ఫాలో చేశారని తెలిపారు. ఆ పార్టీలో గ్రూప్ తగాదాలు తారాస్థాయికి చేరాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో కూర్చీ పంచాయితీ నడుస్తోందని మిగతా 2లో

## కెసిఆర్ అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదు



రేవంత్ దెబ్బకు గిలగిల కొట్టుకుంటున్న బిఆర్ఎస్ నేత

పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అద్దంకి దయాకర్

**జనగామ:** కెసిఆర్ అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు రేవంత్ రెడ్డిని తట్టుకోవడం అంత ఈజీ కాదని స్పష్టం చేశారు.జనగామ జిల్లా పాలకుర్తిలోని బృందావన్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మిగతా 2లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒక్కటే



ఓకే కంపెనీ డైరెక్టర్లు వారు

నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్

**నిజామాబాద్:** కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒక్కటేనని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలు ఒకే కంపెనీకి చెందిన డైరెక్టర్లలాంటి వారని విమర్శలు చేశారు. సోమవారం జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో పసుపు పరిశ్రమను ఎంపీ ధర్మపురి అరవింద్ మిగతా 2లో



## ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

కేంద్ర,రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి

రాజీవ్ రహదారిని మంచిర్యాల వరకు పొడగించాలి

కాగజ్ నగర్ సభలో కేంద్రమంత్రి బండి సంజయ్

నక్సల్స్‌తో చర్చల ప్రసక్తి లేదు

తుపాకీ చేతపట్టిన వారితో చర్చలేమిటి

కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ

**కుమ్రంభీమ్ ఆసిఫాబాద్:** ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని... అభివృద్ధి విషయంలో కాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రాలఅభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ నమ్ముతారని అన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి అభివృద్ధిలో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో హైవేల విస్తీర్ణం 5,100 కి.మీ.కు చేరుకుందని ఆయన అన్నారు. మంత్రి కోమటిరెడ్డి బోళ మంత్రి..మనసులో ఏమి ఉంచుకోడు.. ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మహారాష్ట్ర బార్డర్ లో నేషనల్ హైవేకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్. రూ. 3526 మిగతా 2లో

# మీ ప్రభుత్వంలో గురుకుల భవనాలకు అద్దె స్తోమత లేదు.

# విద్యార్థులకు సరైన భోజనం పెట్టడానికి డబ్బులు లేవు!

**తెలంగాణ మహిళల హామీలు మరిచి 200 కోట్లతో ప్రపంచ అందాల పోటీలు అవసరమా.!**

**రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత రేవంత్ సర్కార్ కె దక్కింది.!**

**కాంగ్రెస్ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. భవనగిరి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అధికారాన్ని చేజిక్కించేందుకు అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటిని అమలు చేయడానికి అవస్థలు పడుతుందని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత రేవంత్ సర్కార్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. పూర్తి స్థాయిలో రైతు భరోసా, రుణమాఫీ అమలు కాకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నా పేదల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలేదని విమర్శించారు. పింఛన్ 4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, మహిళలకు రూ.2,500లు, యువతులకు స్కూటీ ఎక్కడా అని ప్రశ్నించారు. ఆరోగ్య తెలంగాణ కోసం న్యూట్రిషన్ కిట్లు, కెసిఆర్ కిట్లు కూడా మహిళలకు అందించడంలో విఫలమైందని అన్నారు,తెలంగాణ మహిళల హామీలను మరిచి 200 కోట్లతో ప్రపంచ అందాల పోటీలు అవసరమా అని అన్నారు

పంటలకు నీళ్లు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు, గొల్ల కురుమలకు గొర్ల పంపిణీ ఆపి, చెరువుల్లో నీళ్లు లేక చేపల పంపిణీ అందించలేక, కుల వృత్తులకు ఆర్థిక సహాయం అందించడంలో ధూప దీప నైవేద్యం అందించే పూజారులకు, మసీదులో ఇమాములకు నెలసరి ఖర్చులు కూడా ఈ ప్రభుత్వం ఆపిందని అన్నారు, సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు



కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను, మోసపూరిత హామీలను ప్రతి కార్యకర్త ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు భువనగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరుపున పోరాటం చేస్తామని వివరించారు. బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్




# భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత

## ::: రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు

ఢిల్లీ: భారత్–పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగుతోంది. పాక్ కవ్వింపు చర్యలు ఆగడం లేదు. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు కొనసాగుతున్నాయి. వరుసగా 12వ రోజు కాల్పుల విరమణ ఒప్పందం పాకిస్తాన్ ఉల్లంఘించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ జమ్మూ కశ్మీర్‌లో 8 సెక్టార్లలో పాక్ సైన్యం సోమవారం విచ్చలవిడి కాల్పులకు దిగింది. కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరీ, మెంధార్, నౌషేరా, సుందర్బని, అఖ్నూర్ సెక్టార్లలో పాక్ కవ్వింపుల చర్యలకు దీటుగా బదులిచ్చినట్టు సైనిక వర్గాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్ర దాడులకు ప్రతి చర్యల్లో భాగంగా సింధూ జల ఒప్పందాన్ని పక్కన పెడుతూ ఏప్రిల్ 24న కేంద్రం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఆ వెంటనే నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం ఆగడాలు మొదలయ్యాయి. యుద్ధ సన్నద్ధత కోసం సరిహద్దు రాష్ట్రాలలో రేపు మాక్ డ్రిల్ చేయాలని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. పంజాబ్, గుజరాత్, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్, లడక్ రాష్ట్రాలకు సూచించింది. పౌరుల రక్షణ కోసం మే 7న మాక్ డ్రిల్ నిర్వహించాలని సరిహద్దు రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. శత్రువుల వైమానిక దాడి సమయంలో తమను తాము రక్షించుకునే విధానం పై పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వనుంది. ఎయిర్ రైడ్ సైరన్స్ పనితీరు పరీక్షించడం . సైరన్ ఇచ్చి ప్రజలను ఎలా అప్రమత్తం చేయాలని అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. కాగా, సరిహద్దులు దాటి భారత భూభాగంలోకి దొంగచాటుగా ప్రవేశించిన పాకిస్తాన్ జాతీయుడిని అరెస్ట్ చేసినట్లు బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. అతడి నుంచి పాక్ కరెన్సీని, గుర్తింపు కార్డును స్వాధీనం చేసుకున్నారు.గుజ్రన్ వాలాకు చెందిన మహ్మద్ హుస్నైన్‌గా గుర్తించిన అతడు ప్రస్తుతం పంజాబ్ పోలీసుల కస్టడీలో ఉన్నాడు. పహల్గాం ఘటన అనంతరం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెచ్చు రిల్లిన వేళ ఈ పరిణామం చోటు చేసుకుంది.

# చిన్నలోపం కూడా ఉండొద్దు

దాదాపు 3 వేల మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలన్నారు. మిస్‌వరల్డ్– 2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం సమీక్షించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ సీపీ జి.సుదీర్‌బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతోపాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. పోటీల్లో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్ ఉండాలని సీఎం సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రారంభోత్సవం నుంచి... 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. చార్మినార్, లాడ్‌బజార్, సచివాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లోని పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాట్లు, భద్రత కల్పించాలన్నారు. అనుకోని అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా, వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతోపాటు ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతోపాటు గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సచివాలయ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతోపాటు వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరపున ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు.



# సబితమ్మ జన్మదినం...

# మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం

**ప్రారంభించిన సబితమ్మ తనయుడు కౌశిక్‌రెడ్డి**

**మాజీ కార్పొరేటర్లు ధన లక్ష్మి రాజ్ కుమార్, ఏనుగుల అనిల్ యాదవ్ ను అభినందించిన కౌశిక్‌రెడ్డి**






బాలాపూర్, వార్త మిర్రర్ : మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే , రాష్ట్ర విద్యా శాఖ మాజీ మంత్రి పి.సబిత ఇంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఎస్ వై ఆర్ కన్వెన్షన్ హాల్ నిర్వహించిన జన్మదినోత్సవ వేడుకల కార్యక్రమం లో పాల్గొని మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్, దోమల పల్లి ధనలక్ష్మి రాజ్ కుమార్ , శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. కర్మన్ ఘాట్ శ్రీ ధ్యానంజనేయ దేవస్థానం వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్పొరేటర్లు దోమలపల్లి ధనలక్ష్మి రాజ్ కుమార్ , ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిభిరంను యువ నాయకులు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి సందర్శించి తన రక్తాన్ని దానం చేసి చేశారు. కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. యువ నాయకుడు కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తన తల్లి సబితమ్మ జన్మదిన సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణదాతలుగా నిలిచే సేవ కార్యక్రమమైన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసిన కార్పొరేటర్లను అభినందించారు. దాదాపు 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సబితా రెడ్డి సర్టిఫికెట్స్ అందజేసారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ డైరెక్టర్ మేకల యాదగిరి , మున్సిపల్ బీ ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ , సినియర్ నాయకులు దయానంద్ ముదిరాజ్, దండు మహేందర్ కార్యకర్తలు, సబితమ్మ అభిమానులు పాల్గొన్నారు

# ఖమ్మం జిల్లాలో కేటాయించిన 29 గుంటల భూమి స్థలం అభివృద్ధికి 2 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలి!

**కల్లుగీత వృత్తిదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి - పల్లె లక్ష్మణరావు గౌడ్**

**గీతా పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ఏర్పాటుచేసి 1000 కోట్ల నిధులను కేటాయించాలి - బద్దం ధనుంజయ్ గౌడ్**


**మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్-టి పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు వినతి**







హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి : గౌడ సంఘం అభివృద్ధికి ఖమ్మం జిల్లాలో కేటాయించిన 29 గుంటల భూమి స్థలంలో గౌడ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్, ఇతర అభివృద్ధి పనులకు 2 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలని, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టి పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కోరిన తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్, వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో గీత కార్మికుల సమస్యలను, కల్లుగీత వృత్తిదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గీత పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసి 1000 కోట్ల నిధులు కేటాయించాలని, గౌడ విద్యార్థుల విదేశీ విద్యకు ఆర్థిక సాయం అందించాలని పలు సమస్యలను తెలుపగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టి పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి అభివృద్ధికి 2 కోట్ల రూపాయలను సమకూరుస్తామని గౌడ సంఘం నాయకులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గౌడ సొసైటీ సభ్యులు, తెలంగాణ గౌడ సంఘం నాయకులు గౌడ సంఘం సిటీ ప్రెసిడెంట్ దేవేందర్ గౌడ్ ప్రముఖ నాయకులు పాల్గొన్నారు



## సబితా ఇంద్రారెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సాయిబాబా

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :జిల్లెల్గుడా జే వై ఆర్ కన్వెన్షన్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి మహేశ్వరం శాసనసభ్యులు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకకు హాజరైన శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు మరియు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి నీ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో దారుకుపల్లి నరేష్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నాడు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :

శేరిలింగంపల్లి జడ్పీహెచ్ఎస్. 1995–1996 బ్యాచ్ విద్యార్థులు 25 ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా.. అప్పుడు పాఠాలు నేర్పించిన టీచర్లను పిలిచి శాలువాలు, పూలదండలు, మొక్కలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీచర్లందరూ విద్యార్థుల తీరును చూసి ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిహెచ్ఎల్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పి.ఎల్.మాధురికి కెమిస్ట్రీలో పీహెచ్డీ.



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని పి.ఎల్.మాధురి డాక్టరేట్ కు అర్హత సాధించారు. గోధుమ గడ్డి ఆకులను సహజ క్షయకరణ, క్యాపింగ్ ఏజెంట్ గా ఉపయోగించి మెటల్ ఆక్సైడ్ నానోకంపోజిట్లను సంశ్లేషణ ద్వారా నీటి కాలుష్య నివారణకు పర్యావరణ అనుకూల విధానాన్ని అన్వేషించడంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఫణి రాజా సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ మాధురి చేసిన అత్యుత్తమ పరిశోధన స్థిరమైన శాస్త్రం, పర్యావరణ కాలుష్య నివారణకు గణనీయమైన సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ పర్యావరణ అనుకూల పద్ధతి ఫోటోకాటలిటిక్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో జింక్ ఆక్సైడ్-కార్బన్, కాపర్ ఆక్సైడ్, మాగ్నెటైట్-కార్బన్, నికెల్ ఆక్సైడ్ వంటి నానోకంపోజిట్లను ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. నీటి శుద్ధి కోసం తక్కువ వ్యయంతో కూడిన, సమర్థవంతమైన నానోమెటీరియల్స్ అభివృద్ధి చేయడానికి సేంద్రీయ వ్యవసాయ వ్యర్థాలను ఎలా సమర్థంగా ఉపయోగించవచ్చో ఈ అధ్యయనం వెల్లడిస్తుందన్నారు.డాక్టర్ మాధురి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.పరివర్తనాత్మక విద్యా ప్రయత్నాల ద్వారా పరిశోధన నైపుణ్యం, ఆవిష్కరణలను పెంపొందించే లక్ష్యంతో గీతం ముందుకు సాగుతోందని తెలియజేశారు.



## భారతీయ జనతా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం

### - ప్రజల కు నిరంతరం అందుబాటులో ఉండాలి - రవికుమార్ యాదవ్..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఒక లక్ష్యం, ఒక కల సాకారం కావడానికి పునాది వేసుకోవడానికి, ఇక్కడ కూర్చుని ప్రజల సమస్యల గురించి చర్చించి ,భవిష్యత్తు ప్రణాళికలు రచించి చర్చించి ప్రజల కష్టాలు తీర్చే కేంద్రంగా పార్టీ ఆఫీస్ ఉండాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంటెస్టెంట్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనీ మియాపూర్ డివిజన్ మక్త మహబూబ్ పేట్ గ్రామం లో గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని రవి కుమార్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ నూతన కార్యాలయం ప్రజలకు,నాయకులకు మధ్య వారధిలా నిలవాలనీ, ఇది నిరంతరం ప్రజల గొంతు వినిపించే కేంద్రంగా, వారి ఆకాంక్షలను ప్రతిబింబించే వేదికగా ఉండాలన్నారు. ఇక్కడ ప్రతి ఒక్కరి మాట వినాలి, సమస్యను అర్థం చేసుకొని సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపాలని రవికుమార్ యాదవ్ కోరారు. ఈ సందర్భంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ,పార్టీ పరమైన విషయాలు చర్చించడానికి ఈ కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని విజయవంతంగా పనిచేసి,రాబోయే రోజుల్లో మరింత మంచి సేవలు అందించాలని నిర్వాహకులను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఓబీసీ మోర్చా నాయకులు నాగులు గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, మాణిక్ రావు, శ్రీనివాస్, పట్టాభిరామ్, మల్లేష్, రాము, శివరాజ్, శివారెడ్డి, కుమారస్వామి, నరసింహ రాజు, విజయేందర్,సురేష్, సోను తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలి

### వివిధ టార్గెట్ల పేరుతో ఆశాలపై వేధింపులు ఆపాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ.




నల్లగొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి... మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం పైన చేస్తున్న ముప్పేట దాడికి వ్యతిరేకంగా ఈ నెల 20న 10 కేంద్ర కార్మిక సంఘాలు చేస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఆశా వర్కర్ల జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షురాలు డి మహేశ్వరి అధ్యక్షతన స్థానిక దొడ్డి కొమరయ్య భవన్ లో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం వందేళ్ళ క్రితం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసలుగా మార్చే కుట్ర పన్నుతుందని దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం మరో ప్రతిఘటన పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత 20 సంవత్సరాలుగా ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో ఒక కీలక భూమిక పోషిస్తున్నారని అయినా వారికి కనీస వేతనం పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ ఉద్యోగ భద్రత ప్రమాద బీమా లాంటి ఏ సౌకర్యాలు అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ఎంహెచ్ స్కీమును నిర్వీర్యం చేసి ప్రైవేటుకు అప్పజెప్పే కుట్ర ప్రభుత్వం చేస్తుందని దీనికి వ్యతిరేకంగా ఆశా వర్కర్లు సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఏ ఎన్ సి, ఆరోగ్య మహిళా, టీ.బీ స్ఫుటం బీపీ, షుగర్ లాంటి టార్గెట్లతో ఆశ వర్కర్లను వేధిస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా రైతాంగ వ్యతిరేక విధానాలపైన జరిగే ఈ దేశభక్తి యుత సమ్మెలో ఆశా వర్కర్ల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి టి వెంకటమ్మ, సిఐటియు జిల్లా నాయకులు భీమ గాని గణేష్, ఆశ యూనియన్ నాయకులు జయమ్మ, స్వర్ణ ,ఇందిర,ఎ సునీత, కె లలిత, పద్మ ,పార్వతమ్మ, జ్యోతి,తిరుమల, సైదమ్మ సునీత తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీ చేన్న కేశవ స్వామి గుడి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేత:

### - ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్

కల్వకుర్తి మే 5 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్ట గ్రామలో చెన్నకేశవ స్వామిగుడి నిర్మాణం కోసం మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్,మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ గుడి నిర్మాణం కోసం 150 బ్యాగుల సిమెంట్ ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా పూర్తి నిర్మాణం కోసం సిమెంట్ ఇవ్వడం జరిగింది.అదేవిధంగా ఎల్లికట్ట గ్రామంలో బలగం చిన్న వెంకటయ్య,బెక్కెర గ్రామంలో ముడివేంటి బాలమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. విషయాన్ని తెలుసుకున్న వెంటనే కుటుంబ సభ్యుల పరామర్శించే వారికి ఆర్థిక సహాయం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్లికట్ట బిఆర్ఎస్ పార్టీ నాయకులు భీమయ్య ,కేశవులు, రవి, మహేష్ ,ఆంజనేయులు, చెన్నయ్య ,మల్లేష్ చిన్నయ్య, బెక్కెర గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, గ్రామ నాయకులు పరుశు రాములు, వీరయ్య, కేశవులు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.




## న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని అకాల మరణం పట్ల చౌటుప్పల్ బార్ అసోసియేషన్ సంతాపం

### న్యాయ రంగానికి తీరని లోటు- బాల్యం వెంకటాచలపతి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మాటూరి గిరిజా ప్రియదర్శని గారి మరణం వ్యవస్థకు తీరని లోటని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకట చలపతి అన్నారు. ఆదివారం నాడు అనారోగ్య సమస్యతో మృతి చెందిన హైకోర్టు న్యాయమూర్తి సంతాపం తెలియజేస్తూ చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపాన్ని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాపోలు వేణు, సహాయ కార్యదర్శి అన్ని స్వాతి, కోశాధికారి జల్లా రమేష్,లైబ్రరీ సెక్రెటరీ జక్కర్తి శేఖర్, కార్యవర్గ సభ్యులు ఎండి ఖయ్యూం పాషా, మాజీ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్, ఏ జి పి మక్కా నరసింహ, తాడూరి పరమేష్, పి బిక్షమయ్య, చామట్ల జంగయ్య, బడుగు శ్రీకాంత్, పాల పరమేష్, భరత్ చంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీగా ఎన్నికైన కే, శంకర్ నాయక్ కు ఆత్మీయ సన్మానం

మిర్యాలగూడ, మే 5:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం 10 వార్డ్ నందిపహాడ్ లో నూతనంగా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా డిసిసి అధ్యక్షుడు కె.శంకర్ నాయక్ ను సోమవారం ఆత్మీయ సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధియే ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. ఆదర్శ రైతు జొన్నలగడ్డ మోహన్ రెడ్డి, పగడాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో శంకర్ నాయక్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు, కాంగ్రెస్లో మొదటి నుంచి కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మోహన్ రెడ్డినీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణరెడ్డి, డి. శేఖర్ రెడ్డి, నాగునాయక్, జె.కోటిరెడ్డి, అశోక్, భీమేష్, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన వీడియో సోషల్ మీడియాలో వైరల్






మిర్యాలగూడ మే 5:- (వార్త మిర్రర్)మురికి కాల్వల్లో చెత్తా వేస్తే ఎంత పని చేసిన నిరుపయోగం అవుతుందని మిర్యాలగూడ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల చైతన్యం కోసం మున్సిపల్ కార్మికులు వీడియో తయారు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. వార్డుల్లో చిన్న మురికి కాల్వల్లో, ప్రధాన రోడ్డు లోని మురికి కాల్వల్లో ప్లాస్టిక్, డబ్బాలు, డాక్టర్స్ కాలనీలో మెడికల్ బయో వేస్ట్, సిరంజిలు, ఆపరేషన్ వ్యర్థాలు రోడ్డు మీద, చికెన్ సెంటర్ల వ్యర్థాలు, మురికి కాల్వల్లో వేయడం రోజు వారి పనిగా మారింది. విద్యావంతులు, దుకాణా దారులు, మహిళలు, పిల్లలు మురికి కాల్వల్లో చెత్తా వేస్తున్నారు. మురికి కాల్వలు శుభ్రపర్చిన గంటలోనే చెత్తతో పేరుకు పోతున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలలో చైతన్యం రావాలనీ మేము ఎంత పనిచేసిన బూడిదలో పోసిన పన్నీరు అవుతుందంటున్నారు. ఇప్పటి నుండి అయినాచెత్త బుట్టలను ఉపయోగించి చెత్త ఆటోలో కానీ చెత్త ట్రాక్టర్లో వేయండని సిబ్బంది ప్రచారం చేస్తున్నారు. మన పరిశుభ్రత - మన ఆరోగ్యం పారిశుద్ధ్య కార్మికుల వీడియో వైరల్ చేస్తున్నారు.



## దుబ్బతండా, సాత్ తండాల యూత్ క్రికెట్ క్రీడాకారులకు కిట్లు అందజేసిన లక్ష్మణ్ గౌడ్

మిర్యాలగూడ మే 5:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామపంచాయతీ, సాత్ తండ, దుబ్బతండ యూత్ ల కు క్రికెట్ క్రీడాకారులకు చక్ర టివి ఎండి సామాజికవేత్త కొండ లక్ష్మణ్ గౌడ్ సోమవారం క్రికెట్ కిట్లను అందజేశారు. గ్రామీణ క్రీడాకారులు ప్రతి మ్యాచ్లో ప్రతిభను కనబరిచాలని, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. ప్రతిభగల క్రీడాకారులను తన వంతు ప్రోత్సహిస్తానని పేర్కొన్నారు



## అర్హత గల వారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి

### బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పూర సృజన్ కుమార్ గుప్త

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతిని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని వివిధ గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విషయంలో తప్పకుండా అర్హులకే ఇండ్లను కేటాయించాలన పూర సృజన్ గుప్త అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కమిటీలలో గ్రామపంచాయతీ సిబ్బంది పేర్లు, ఉద్యోగస్తుల పేర్లు, కాంగ్రెస్ బడా నాయకుల పేర్లు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని. ఇండ్ల ఎంపిక విషయంలో కాంగ్రెస్ నాయకులకే ఎక్కువ మొత్తం ఇండ్లు కేటాయించినట్టు తమ వద్ద సమాచారం ఉందని తెలియజేశారు. పది ఏళ్ల తర్వాత ఇందిరమ్మ ఇండ్లు రావడంతో గ్రామాలలో పేదలు, నిరుపేద మహిళలు, ఒంటరి స్త్రీలు, వికలాంగులు చాలామంది ఇండ్లు లేక ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని అటువంటి వారికి ఇల్లు ఇవ్వకుండా కేవలం కాంగ్రెస్ నాయకులు మాత్రమే తమ పేర్లు రాసుకొని ఇండ్లు తీసుకునే విధంగా ఉన్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు బడుగు బలహీన వర్గాలకు ఒంటరి స్త్రీలకు పేదవారికి ఇండ్లు కేటాయించి తమ నిజాయితీని నిరూపించుకోవాలని తెలియజేశారు. రానున్న రోజుల్లో అర్హులకు ఇండ్లు రాకుంటే భారీ ఎత్తున మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



## మాదాపూర్ ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి మండలంలోని మాదాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణా శిబిర%శీ% 2025 పేరుతో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు తెలిపాడు. ఈ కార్యక్రమం లో యోగా, ధ్యానం, పాటలు, ఆటలు, కర్ర సాము, చిత్రలేఖనం రీడింగ్ బుక్స్, వ్యక్తిత్వ వికాసము, ఆరోగ్యపు అలవాట్లు, చేతి వ్రాత, గణితంలో మెళకువలు, స్వయంగా మాట్లాడడం, నృత్యం,టి ఎల్ ఎం తయారీ, ప్రాజెక్టులు వంటివి పిల్లలకు నేర్పించడం జరుగుతుందనీ తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 5వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందనీ. పిల్లలకు స్నాక్స్ అందివ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, లీలాదేవి, బాలా మణి, లక్ష్మీదేవి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



## సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నూతన బూత్ కమిటీల ఎన్నిక

సంస్థాన్ నారాయణపూర్ మే 5 :( వార్త మిర్రర్) నారాయణపూర్ బీజేపీ మండల కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ ఆదేశాల మేరకు మండల ప్రధాన కార్యదర్శి బండమీది కిరణ్ ఆధ్వర్యంలో నూతన బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో 102 వ బూత్ అధ్యక్షులుగా అచ్చిని రవికుమార్,103వ బూత్ అధ్యక్షులుగా పాలకుర్ల శ్రీనివాస్ గౌడ్,107వ బూత్ అధ్యక్షులుగా అంతటి శ్రీనివాస్ గౌడ్,104వ బూత్ అధ్యక్షులుగా పాలకూర్ల లింగస్వామి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది,నూతనంగా ఎన్నుకోబడిన బూత్ అధ్యక్షులను బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నకోబడిన బూత్ అధ్యక్షులు మాట్లాడుతూ మా బూత్ లలో భారతీయ జనతాపి పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు వంగరి రఘు,మండల ప్రధాన కార్యదర్శి బండమీది కిరణ్,గొల్లూరు యాదగిరి సాగర్,వీరమళ్ళ జంగయ్య గౌడ్,గూడూరు మంజునాథ్ రెడ్డి,ఏలే నర్సింహా,సికిలంమెట్ల వెంకటేష్, చిలివేరు సాయిబాబా,అచ్చిని ప్రవీణ్,జెటబోయిన గంగరాజు,సంగిశెట్టి నరేష్,సింగం భాస్కర్,ఇటుకల అనిల్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

### - మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి



కల్వకుర్తి మే 5 వార్త మిర్రర్ ప్రతినిధి:-మాజీ బీసీ కమిషన్ సభ్యులు కల్లోజు ఆచారి పత్రిక విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి ప్రభుత్వ ఉద్యోగుల పై బాధ్యత రహితంగా మాట్లాడం చాలా దారుణం ప్రభుత్వ ఉద్యోగులను కించపరుస్తూ మాట్లాడడం ఇంకా తప్పు ఈ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుటి వ్యక్తి పొట్టకొట్టి నాపొట్ట నింపమని ఏ ఉద్యోగి కూడా అనడు వాళ్లకు రావాల్సిన న్యాయమైన,డిఎ ఏరియల్స్, పిఆర్సి, రిటైర్మెంట్, బెనిఫిట్స్,ఇంకా కొన్ని హక్కుల కోసం మిమ్మల్ని డిమాండ్ చేస్తున్నారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులను పట్టించుకోకపోవడం వల్లే ఈ రాష్ట్ర ప్రభుత్వంలోని ఉద్యోగులు మీ పార్టీకి ఓట్లు వేసి మిమ్మల్ని గెలిపించారు. అలాంటి ఉద్యోగులకు ఈ రోజు మీరు మాట్లాడే మాటలు వాళ్లకు వేదనను కలిగిస్తున్నాయి. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి వివిధ సందర్భాలలో తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలయింది దివాలా తీసింది అని ప్రపంచవ్యాప్తంగా చాటింపు వేస్తున్నాడు దాని ద్వారా ఏ సంస్థ కూడా తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రావట్లేదు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మా రాష్ట్ర పరిస్థితి బాగాలేదు మేము అప్పుల పాలయం అని చెప్పడం వలన ఈ రాష్ట్రానికి ఈ గతి పట్టిందని తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నెల 18500 కోట్ల బడ్జెట్ పన్నుల ద్వారా వస్తుందని చెప్తున్నా ముఖ్యమంత్రికి 420 హామీలు ఇచ్చినప్పుడు ఈ రాష్ట్ర బడ్జెట్ గుర్తులేదా హెచ్ సి యు లో భూములు అమ్మకానికి పెడితే సుప్రీంకోర్టు చివాట్లు పెట్టడంతో ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్రస్ట్రేషన్ లో ఉన్నాడు. మీరు అనవసరంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి హోదాకు తగ్గట్టుగా మాట్లాడి ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.



## యాదగారుపల్లి ప్రభుత్వ పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

మిర్యాలగూడ, మే 5:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం యాదగారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శిబిరంలో 11 నుండి 14 సంవత్సరాల వయసున్న విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి లావూరి బాలునాయక్ కోరారు. అదేవిధంగా క్రీడల వలన వివిధ ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందవచ్చన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. శిక్షణ శిబిరంలో కబడ్డీ, వాలీబాల్, అల్లికలు, డాన్స్ నేర్పిస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటయ్య, అంతర్జాతీయ క్రీడాకారిణి మౌనిక, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటరత్నం, పుష్పలత సైదయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు సోమయ్య పాల్గొన్నారు

# దేవరకొండ లో శ్రీ చైతన్య పాఠశాలకు ప్రభుత్వ పరమైన అనుమతిలేదు

### తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించి మోసపోవద్దు

### దేవరకొండ నియోజకవర్గం కార్యదర్శి బుడిగ వెంకటేష్




దేవరకొండ మే 05 వార్త మిర్రర్ :భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) దేవరకొండ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గం కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ... మాట్లాడుతూ దేవరకొండ పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాలకు పర్మిషన్ లేదు, ఆ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి మోసపోతున్నారు కార్పొరేట్ విద్య పేరుతో రంగురంగుల బ్రోచర్లతో,ఐపీఎల్,ఐఐటి,స్పార్క్ బ్యాచ్ అనే వివిధ రకాల పేర్లతో పర్మిషన్ లేకుండానే తల్లిదండ్రులను మోసం చేస్తూ దేవరకొండ ప్రాంతంలో విద్యను వ్యాపారం చేయడానికి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఖమ్మం శ్రీ చైతన్య పాఠశాల యజమాన్యం ఇప్పటికే అడ్మిషన్లు చేస్తున్నారని ఈ పాఠశాల ఓపెనింగ్ పర్మిషన్ ఫైల్ ని వెంటనే జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు తిరస్కరించాలని డిమాండ్ చేశారు, వాళ్ళు చూపెట్టే పాఠశాల బిల్డింగ్ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో కన్స్ట్రక్షన్ కాలేదు విద్యార్థులకు కావలసిన కనీస సౌకర్యాలు,మౌలిక వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాకుండా ఇప్పటికే అడ్మిషన్లు చేస్తూ లక్షల రూపాయల ఫీజులు,ర్యాంకుల కోసమే ఆలోచిస్తూ ఈ ప్రాంత పేద మధ్యతరగతి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడదామని కార్పొరేట్ ముసుగులో ఖమ్మం శ్రీ చైతన్య పాఠశాల యజమాన్యం పర్మిషన్ ఫైల్ వేయడం జరిగిందన్నారు. వీటన్నిటిని గమనంలో ఉంచుకొని విద్యను వ్యాపారం కాకుండా విద్యాశాఖ అధికారులు,విద్యార్థులను, తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని శ్రీ చైతన్య పాఠశాల పర్మిషన్ ఫైల్ ను రిజెక్ట్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ పాఠశాల పర్మిషన్ ఫైల్ ముందుకు కొనసాగిస్తే ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మండల కార్యదర్శి రామవత్ రాజేష్, చరణ్,సుందర్, గణేష్, మనోహర్, ఆంజనేయులు, శ్రీకాంత్, యశ్వంత్, కార్తీక్, ఏసొబ్, రమేష్, రవి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20 తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

దేవరకొండ మే 05 వార్త మిర్రర్ :మార్కెట్ యార్డులో మే20 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చెయ్యాలని దేవరకొండ నియోజకవర్గం ఆల్ ట్రేడ్ యూనియన్ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము సాధించుకున్న హక్కులను 44 చట్టాలను నాలుకోడులుగా విభజించి కార్మికులపై ఒత్తిడి తెస్తూ మళ్లీ 12 గంటల పని రోజులు అమలుపరుచుటకు చట్టాన్ని అమలు చేయాలని చూస్తున్నది దీనికి వ్యతిరేకంగా భారతదేశవ్యాప్తంగా 22 సార్లు సమ్మె చేయడమైనది మట్టి ఈ సమ్మెలో 20 కోట్ల కార్మికులు కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పినారు ఈనెల 20వ తేదీన భారతదేశవ్యాప్తంగా నాలుగు కోడ్లను రద్దు పరచాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటు కరణ ఆపాలని కనీస వేతన చట్టాలు అమలు అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టాలు చేయాలని చేయాలని కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య ఐఎన్టీయూసీ డివిజన్ అధ్యక్షులు పోట్టేపాక మురళీకృష్ణ టీఆర్ఎస్ కె.వి డివిజన్ నాయకులు ఏపూరి కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ అసంఘటితరం కార్మికులకు సంక్షేమ చట్టాలు రూపొందించాలని పెరుగుతున్న ధరలను అరికట్టాలని కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే లేబర్ కోడులను రద్దు చేయాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఓడపల్లి యాదగిరి నాగటి నాగరాజ్ సర్దార్ నూనె వెంకటేశ్వర్లు జూలూరు వెంకట్ రాములు అలామని మల్లయ్య నా రోజు సైదాచారి ఇలియాజ్ పటేల్ బొడ్డుపల్లి అయోధ్య వెంకటమ్మ బొజ్జ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలి

### రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 5 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పొలాస శాస్త్రవేత్తలు దత్తత గ్రామమైన అల్లీపూర్ రైతులకు వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ రవి మాట్లాడుతూ అవసరం లేకుండా పురుగు మందులను వాడొద్దని తెలిపారు. రెండు మూడు రకాల రసాయన పురుగు మందులను పంటకు ఒకేసారి స్ప్రే పంపులో కలుపుకొని పిచికారి చేయవద్దని అన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలని కోరారు రైతులు వారి గట్లపై పండ్ల చెట్లు మరియు వివిధ రకాల చెట్లను పెంచుకున్నట్లయితే అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని యూరియా వాడకాన్ని తగ్గించుకొని పెట్టుబడి ఖర్చును తగ్గించుకోవాలని అన్నారు పంట మార్పిడి చేసినట్లయితే భూసారం పెరిగి అధిగ దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. సాగునీటిని ఆదా చేసుకొని భావితరాలకు కాపాడాలని సూచించారు. శాస్త్రవేత్త బి శ్రీనివాస్ మాట్లా డుతూ.. ..... ప్రతి రైతు విత్తనాలను వారి యొక్క పొలంలో నుంచే తీసుకోవాలని అలా తీసు కోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని అన్నారు రైతులు పురుగుల మందు విత్తనాలు తీసుకున్న సమయంలో రసీదును భద్రపరచుకోవాలని పంట నష్టం జరిగినట్టయితే రసీదు ద్వారా నష్టపరిహారాన్ని పొందే అవకాశం ఉంటుందని అన్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకే రసాయనిక ఎరువులను వాడాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి ముక్తేశ్వర్ మాట్లాడుతూ........ రైతులు వరి మొక్కజొన్న ఇతరత్రా కాకుండా పామాయిల్ పంటను వేసుకోవడం వల్ల అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు భూదార్ కార్డు కొరకు స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఫాక్స్ చైర్మన్ రాజలింగం మాట్లాడుతూ...... సేంద్రీయ పద్ధతిలో పండించుకోవాలని సేంద్రియ పద్ధతిలో రైతులు పంటలు వివిధ రకాల కూరగాయలు పండించుకొని ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని అన్నారు. సమావేశ అనంతరం శాస్త్రవేత్తలు రైతులు కలిసి రైతు వేదిక ముందర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫాక్స్ చైర్మన్ రాజలింగం, వ్యవసాయ విస్తరణ అధికారి సృజన ,ఎఫ్ పి ఓ చైర్మన్ అత్తినేని శంకర్, మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేష్, ఎఫ్ పి ఓ డైరెక్టర్లు అత్తినేని రాజన్న, బొజ్జ దేవేందర్ రావు, ఓరుగంటి రాజలింగం, ఎంబారి వెంకట్ రెడ్డి, పుప్పాల రాజారెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



# నేరేడు గొమ్ము మోడల్ స్కూల్లో ఇంటర్ అడ్మిషన్స్

### ఇంటర్లో ప్రతి గ్రూపుకు 40 సీట్లు

### బాలికలకు ఉచిత హాస్టల్ వసతి

### విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ప్రిన్సిపాల్ శిరీష



నేరేడు గొమ్ము మే 05 వార్త మిర్రర్ :నేరేడు గొమ్ము మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ కొర్ర శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2025-2026 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఇంటర్మీడియట్ లో ఇంగ్లీష్ మీడియం లో ఎంపీసీ బైపిసి ఎంఈసి సిఈసి ల గ్రూపులలో 40 సీట్లు ప్రతి గ్రూపుకి సీట్లు కలవని బాలికలకు ఉచిత హాస్టల్ వసతి కూడా ఉంటుందని ఆమె తెలిపారు. ఆశావాహులైన విద్యార్థులు ఈనెల 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని వాటికి సంబంధించిన పూర్తి వివరాలు వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. అదేవిధంగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారికి యొక్క ఎంపిక లిస్టును ఈనెల 26వ తేదీన పాఠశాలలోని నోటీస్ బోర్డు నందు ప్రదర్శిస్తామని అదేవిధంగా 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆమె తెలిపారు. జూన్ రెండవ తేదీన తరగతులు ప్రారంభమవుతాయ ని పరిసర ప్రాంతాలు విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇంతటి చక్కటి అవకాశాన్ని కల్పిస్తున్నందున విద్యార్థులు అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కొర్ర శిరీష విద్యార్థులను కోరారు.

## సత్తా చాటిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినిలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 5 జగిత్యాల జిల్లా రాయికల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినిలు పదవ తరగతి మరియు ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇందులో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిలు చంద్రకళ 969 మార్కులు, బొంత సాత్విక 558 మార్కులు, జంగ సాహిత్య 540 మార్కులు వచ్చిన విద్యార్థులను స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, జిల్లా విద్యాధికారి రాము, జి సి డి వో అనుపమలు అభినందించడం జరిగింది. విద్యార్థినిలకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, రివిజన్ టెస్ట్ ల నిర్వహణ, క్రమం తప్పకుండా తల్లిదండ్రుల సమావేశాల వలన ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎన్.శోభారాణి తో పాటు ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఓయూ లో ఘనంగా డా.ఎర్రోళ్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 5.. తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద బీఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి బోల్లు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్వి నాయకులు నాగరం ప్రశాంత్ ,నాగేందర్ రావు కోదాటి,నిఖిల్ పటేల్ ,దేవంశ్ ,ధీరజ్ ,లెనిన్ ,అంజి ,శ్రవణ్ ,క్రాంతి , రవి,శ్రీకాంత్ ,మహేష్ ,పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

### - ఎస్సై మాధవరెడ్డి



కల్వకుర్తి ఏప్రిల్ 5 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణంలోని అశోక థియేటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు సమాచారం ఇవ్వగా పోలీసు సిబ్బంది మృతుని వద్దకు వెళ్లి సమాచారం సేకరించారు. పోలీస్ వివరాల ప్రకారం అతని పేరు శంకరప్ప(60) తండ్రి సీతప్ప కులం బైండ్ల, గ్రామం చౌదర్పల్లి, మండలం వంగూరు అని గుర్తించగా మృతుని దూరపు బంధువులకు సమాచారం ఇవ్వడం జరిగిందని మృతుడు గత పది సంవత్సరాల నుండి కల్వకుర్తి పట్టణంలో అడుక్కుంటూ యాచకుడిలా తిరుగుతుండేవాడు వివిధ అనారోగ్యపు కారణాల వల్ల సరైన తిండి లేకపోవడం వలన చనిపోయి ఉండొచ్చని చుట్టుపక్కల ప్రజలు తెలియజేయడం జరిగినది బంధువులు వచ్చి ఫిర్యాదు చేసిన పిదప కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్ఐ మాధవరెడ్డి తెలియజేశారు.



## చటారీ దశరథ్ ఆధ్వర్యంలో ఓయూలో ఘనంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 5 ....మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే, సబిత ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ఆధ్వర్యంలో ఓయూ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చాటరి దశరథ్ మాట్లాడుతూ%ౌతెలంగాణ సాధనే ద్యేయమని తెలంగాణ తల్లి దాస్య శృంఖలాలు విముక్తికై పార్టీ స్థాపించిన పట్లోళ్ల ఇంద్రా రెడ్డి చూపిన మార్గంలో నడుస్తూ కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధికి దోహదపడిన నేత సబితమ్మ ఇంద్రన్న మరణించిన నాటినుండి రంగారెడ్డి జిల్లా ప్రజలకు పెద్దదిక్కుగా నిలబడి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతున్న నాయకురాలన్నారు.ఉత్తమ శాసన సభ్యురాలుగా ఆమె మరింత కాలం రాజకీయాలలో ఉన్నతంగా కొనసాగాలని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు సత్యక్క, బీఆర్ఎస్ వి నాయకులు, నాగేందర్, నిఖిల్, రాకేష్, కాశీనాథ్, శరత్, శేఖర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## శాన్ ఫ్రాన్సిస్కో లో ట్రంప్ విధానాలకు నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మిర్యాలగూడ వాసులు

మిర్యాలగూడ మే 5:- (వార్త మిర్రర్) అమెరికా సంయుక్త రాష్ట్రం లోని శాన్ ఫ్రాన్సిస్కో లో జరిగిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల వ్యతిరేకంగా, పాలస్తీనాకు సానుభూతిగా జరిగిన నిరసన ప్రదర్శనలో మిర్యాలగూడ వాసులు పాల్గొన్నారు. మిర్యాలగూడకు చెందిన భారత్ బచావో ఆందోళన్ జిల్లా అధ్యక్షులు ఉదయ, సభ్యులు పి.అజయ్ కుమార్, నీలు, విశాల్ లు ప్ల కార్డులు చేత పట్టి ప్రదర్శనలో పాల్గొన్నారు. మృత్యుకు నిధులు ఆపు అమెరికా, ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవాలి, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, గాజా పై దాడులు ఆపాలని, నిరంకుశ విధానాలు ఆపాలని ప్ల కార్డులు ప్రదర్శించారు.

# అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 05

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్వీస్ రోడ్ లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు గురై వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్రమ కట్టడం దర్గా పై చర్యలు తీసుకోవాలని బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో కు వినతిపత్రం అందజేసిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి తనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై గ్రీన్ ఫీల్డ్ హైవేలు మరియు ఎక్స్ ప్రెస్ రహదారులు నిర్మించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుంది కానీ విజయవాడ టు హైదరాబాదుకు వెళ్లే జాతీయ రహదారి 65 పై సర్వీస్ రోడ్లో అడ్డంగా ప్రార్థనా మందిరాలు నిర్వహిస్తున్న కానీ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి నిమ్మకు నీరు ఎత్తకుండా వ్యవహరిస్తున్నారు వీరి వ్యవహార శైలి చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ తో ఇబ్బంది పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని సుమారు 114 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించిన తర్వాత అనుమతులు వచ్చిన తర్వాత దాని అలైన్మెంట్ ఈ దర్గా కోసం అలైన్మెంట్ మార్చారు మొదట ఎలాగైతే అనుమతులు ఇచ్చారో దాని ప్రకారమే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని ఒక వర్గం కోసం ఎదురు చూడకుండా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా రహదారులు నిర్మించాలని కోరారు..ఈ కార్యక్రమంలోనల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి,మునుగోడు బిజెపి కన్వీనర్ దుడాల భిక్షం, మండల అధ్యక్షుడు కైరం కొండ అశోక్,మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన,బిజెపి మున్సిపల్ సీనియర్ నాయకులు రమణ గోని శంకర్,బిజెపి మండల మాజీ అధ్యక్షుడు రీక్కల సుధాకర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు బాతారజు సత్యం,బీజేవైఎం మండల అధ్యక్షుడు పబ్బు వంశీ,బీజేవైఎం జిల్లా సెక్రెటరీ దిండు భాస్కర్ నల్లగొండ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు..



# సోషలిస్ట్ కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్.

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 05

ఎండి జహంగీర్ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి. కష్టాల కొలిమిలో కాలిన జీవితం. శ్రామిక జనచైతన్యమే తన ధ్యేయం. సోషలిస్ట్ కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్. అని అన్నారు. కార్ల్ మార్క్స్ జయంతి సందర్భంగా సోమవారం రోజున చౌటుప్పల్ మున్సిపాలిటీలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో. సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్ అధ్యక్షతన మార్క్స్ జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జహంగీర్ మాట్లాడుతూ. సమ సమాజ స్థాపన కోసం. కృషి చేసిన సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్ అని అన్నారు. జర్మన్ శాస్త్రవేత్త .తత్వవేత్త. ఆర్థికవేత్త. సామాజికవేత్త. పాత్రికేయుడు. సోషలిస్టు విప్లవకారుడు కార్ల మార్క్స్ అని అన్నారు. సమాజం ఆర్థిక శాస్త్రం. మాక్సిజన్ ప్రధానంగా రాజకీయాల వంటి వాటిపై మార్క్స్ సిద్ధాంతాలను కలగలిపి మాక్సిజంగా పిలుస్తున్నారు. మార్క్సిజం ప్రధానంగా మానవ సమాజలు వర్గ పోరాటాల ద్వారా అభివృద్ధి చెందాయని అన్నారు. మార్క్స్ కార్మిక వర్గ పెట్టుబడిదారీ వ్యవస్థలను కూలదోసి సామాజిక ఆర్థిక విముక్తి తీసుకువచ్చేందుకు సంఘటితంగా విప్లవ చర్య చేపట్టాలని వాదిస్తూ క్రియాశీలంగా దాని ఆచరణ కోసం పోరాడాలి అని అన్నారు. మార్క్సిస్టు మేధావి. కార్మిక వర్గ సిద్ధాంతకర్త. కామ్రేడ్ కార్ల్ మార్క్స్ జయంతి నిర్వహించుకోవడం. అతని ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు.రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ,బూర్గు కృష్ణారెడ్డి,గోశిక కరుణాకర్,రాగిరి కిష్టయ్య,నాయకులు బొజ్జ బాలయ్య,బత్తుల దాసు,ఉస్కా గుల శ్రీను,బొడ్డు రాజు,బోయ యాదయ్య,ఎండి. ఖయ్యూం,భావనలపల్లి స్వామి,కందగట్ల ఆనంద్,కల్వకుంట్ల శివ, సప్పిడి శ్రీనివాసరెడ్డి,బత్తుల రమేష,బత్తుల జయమ్మ. పెంటయ్య. తదితరులు పాల్గొనడం జరిగింది





## సబితమ్మ జన్మదినోత్సవ వేడుకలకు అడుగడుగున జననీరాజనం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి...మే 5 :

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో బాలాజీ దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు పూజల అనంతరం భారీ బైక్ ర్యాలీతో సబితమ్మ సామ యాది రెడ్డి గార్డెన్‌కు బయలుదేరగా, మార్గమంతా అభిమానులు పూల వర్షాలతో జననీరాజనం పలికారు రంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమం అశేష ప్రజాసాన్నిధ్యంతో కొనసాగింది.ఈ కార్యక్రమంలో సిద్దాల లావణ్య, బీరప్ప, భూపేష్ గౌడ్, అర్కల భూపాల్ రెడ్డి, బొక్క రాజేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అనిల్ యాదవ్, సునీత బాలరాజ్, విజయలక్ష్మి, లలితా జగన్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ ఉమామహేశ్వర సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 5... శ్రీ శ్రీ శ్రీ ఉమామహేశ్వర సహిత శ్రీ శ్రీ శ్రీ వేంకటేశ్వర దేవస్థానం శత వార్షికోత్సవ సందర్భంగా నూతనంగా శ్రీ కాళ భైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికిఆలయ కమిటి చైర్ మెన్ సభ్యులు, దారబోయిన శ్రీనివాస్ యాదవ్, కిషన్ ప్రసాద్,, జే. ప్రకాశ్, గోవర్ధన్ యాదవ్ , రవి,జనార్ధన్, పాండు, ఏ. వెంకటేష్,పూర్ణ కుంభం, తమల భాజా తో ముఖ్య అతిధులకు ఆవాహనం పలుకుతూ స్వాగతం పలికారు.కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్ర రావు,మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షులు భారత్ గౌడ్, దిశా కమిటీ సభ్యురాలు శారదామల్లేష్,మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి,జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఆదం సంతోష్, నాగులూరి సాయి బాబా, మేకల సారంగపాణి,రాచ మల్ల కృష్ణమూర్తి, బి.వేణు యాదవ్,కందాడి నాగేశ్వర్ రెడ్డి,కనకట్ల హరి,కే.ఎం ప్రభు గుప్తా,ఎం. పోచయ్య,ఎస్.వెంకటేష్ గౌడ్,వీరన్న, సేథీ మహేష్, రాము,సిద్దార్థ,వసంత కుమార్,విక్రమ సింహరెడ్డి,ఆదర్శ్ కుమార్, జే. ప్రకాష్,సత్తూర్ రవీందర్, డి అనిత,గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్ చారి,అంబాల రాజేశ్వర్,అజయ్ నాయుడు,ఉపేందర్ యాదవ్,నరేశ్, ఆకారపు రమేష్,భాస్కర్ గిరి,గంగాధర్ యాదవ్,హనుమంతు, రమేష్,గోపి,శ్రీమతి నాగలక్ష్మి, సందీప్, శివానంద, శ్రీధర్ రావు, బుష్పక్ శ్రీనివాస్, రామకృష్ణ,వెంకటేష్ తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.



## నీటి పరీక్షను రద్దు చేయాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం

మిర్యాలగూడ, మే 5:-( వార్త మిర్రర్)విద్యార్థులను ఇబ్బంది పెట్టిన నీట్ పరీక్షను రద్దు చేయాలని స్థానిక సబ్ కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ శర్మకు సమర్పించిన వినతిపత్రంలో ఎఐఎంఐఎం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారుక్ కోరారు. నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్టిఎ డైరెక్టర్ ప్రదీప్ సింగ్ అఖోలాను సస్పెండ్ చేయాలని కోరారు. గతంలో నీట్ పరీక్షలో జరిగిన స్కాం అనేక కేసులు నమోదు చేశారన్న కోపంతో ఈ సంవత్సరం భౌతికశాస్త్రం, బయాలజీ, కెమిస్ట్రీలో మోడరైట్, ఎన్సీఈఆర్టీకి సంబంధం లేకుండా ఉపాధ్యాయులు కీ పేపర్ ఆన్సర్ చేయడానికి చాలా ప్రయత్నించిన ఉపాధ్యాయులకే ఐదు ఆరు గంటల సమయం పడుతుంది అంటే వెళ్లిన 25 లక్షల విద్యార్థుల పరిస్థితి ఏందో ఒకసారి కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకొని మళ్లీ నీట్ పరీక్షను నిర్వహించాలని వినతిపత్రం కోరామని తెలిపారు. కార్యక్రమంలో రాంబాబు వెంకటరత్నం మస్తాన్ పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాలో భూకంపం...



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 5

జగిత్యాల లలో రాయికల్, సారంగాపూర్ మొదలగు అన్ని మండలాలలో సోమవారం రోజు సాయంత్రం 6 గంటల 47 నిమిషాలకు భూమి కనిపించింది. సుమారు ఐదు సెకండ్ల పాటు భూమి కంపించడంతో ఏం జరుగుతుందో అర్థం కాక ప్రజలు భయాందోళన చెందారు. భూమి కనిపించడంతో ఇంట్లోని వస్తువులు చిన్నపాటి కుదుపులకు గురయ్యాయి. స్వల్ప భూకంపం కారణంగానే భూమి కనిపించినట్లుగా స్పష్టమవుతుంది. రిక్టర్ స్కేల్ పై భూకంప తీవ్రత 3.9గా నమోదైనట్లు సమాచారం.



## తెలంగాణ గౌడ సంఘం నాయకులతో టి పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశం

### కల్లుగీత వృత్తిదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలి- బద్దం ధనుంజయ్ గౌడ్

హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి

హైదరాబాద్ లో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కమిటీ నాయకుల తో టి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్, ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు గీత కార్మికుల సమస్యలపై వారి ఇచ్చిన వినతి పత్రాన్ని దృష్టిలో పెట్టుకొని, వారు కోరిన ఖమ్మం జిల్లాలో కేటాయించిన 29 గుంటల స్థలంలో గౌడ కమ్యూనిటీ హాల్, ఇతర అభివృద్ధికి రెండు కోట్ల రూపాయలు విడుదల చేస్తామని తెలిపారు. గౌడ కార్మిక సమస్యలుతెలంగాణ వ్యాప్తంగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి సమస్యను దృష్టిలో పెట్టుకొని నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు తెలంగాణ పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, వీరి హామీని తెలంగాణ గౌడ సంఘం నాయకులు సానుకూలంగా స్పందించారు, ఈ ప్రభుత్వంలో గీతా కార్మికుల సమస్యలు పరిష్కరించబడతాయని వారు కూడా తెలిపారు